క్లుప్తంగా

అన్నప్రసాద వితరణ



జంగారెడ్డిగూడెం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నసమారాధన

జంగారెడ్డిగూడెం: స్థానిక రాజుల కాలనీలో శ్రీవల్లీ దేవసేన సమేత సుందర బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద మంగళవారం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి చక్కెర పొంగలి, పులిహోర, రెండు రకాల కూరలు, ఒక చట్నీ, సాంబారు, పెరుగు, అన్న ప్రసాదముతో నైవేద్యం సమర్పించారు. 1500 మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ అన్నదాన కమిటీ అధ్యక్షుడు కానూరి గంగాధరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి దాతలుగా ముత్తా గంటారావు, సోరపల్లి శివ సత్య సాయిబాబు వ్యవహరించినట్లు చెప్పారు.

వృద్ధులకు అన్నసమారాధన



వృద్ధాశ్రమంలో అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: కల్పవృక్ష వృద్ధాశ్రమంలో మంగళవారం వృద్ధులకు అన్న సమారాధన నిర్వహించారు. ఎస్సై జీజే విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో పోలీసు శాఖ ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించింది. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో మానవత్వం, సామాజిక బాధ్యతల పట్ల అవగాహన కల్పించేందుకు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు విష్ణువర్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం, రాత్రి వృద్ధులకు పౌష్టికాహారాన్ని, పండ్ల రసాలను అందజేశారు. కల్పవృక్ష వృద్ధాశ్రమం రోటరీ క్లబ్ నిర్వాహకులను ఎస్సై అభినందించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధితులకు ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడి పరామర్శ

దెందులూరు: కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఏలూరు ఆశ్రం వైద్యశాలలో ఐసీయూలో చికిత్స పొందుతున్న వారిని ఎంఆర్‌పీఎస్ నాయకులు కంకిపాటి నాగరాజు, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్, డాక్టర్ లింగయ్య, ముల్పూరి రాంబాబు పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. వారి ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్యసేవల వివరాలను బంధువులను అడిగి తెలుసుకున్నారు. బాధితులు త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు.

24న సర్వసభ్య సమావేశం

పెదపాడు: ఈనెల 24న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు పెదపాడు ఎంపీడీవో తేజరతన్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు పెదపాడు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

ఆపదలో ఉన్నవారికి ఉచితంగా రక్తదానం

దెందులూరు: ఆపదలో, వివిధ కారణాల వల్ల రక్తం అవసరమైన వారు ఉచిత రక్తదాన గ్రూపు సేవలను సద్వినియోగం చేసుకోవాలని జాతీయ ఉత్తమ రక్త సరఫరా సహాయకులు అవార్డు గ్రహీత ఎన్‌జీవో సొంగా రవీంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం గంగన్నగూడెంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ రెండు రాష్ట్రాల్లో ఏ ప్రాంతం వారైనా, ఏ గ్రూపు రక్తం కావాల్సినా తమ ఉచిత రక్తదాన గ్రూపు సేవలను వినియోగించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9441390810 నంబర్‌కు సంప్రదించాలన్నారు. లేదా వాట్సాప్‌లోని ఉచిత రక్తదాన గ్రూపులో చేరి సేవలు పొందవచ్చని తెలిపారు. ఈ గ్రూపు ద్వారా ప్రాంతాలకు అతీతంగా అవసరమైన రక్తాన్ని సకాలంలో అందజేస్తామని రవీంద్రప్రసాద్ వివరించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

దెందులూరు: ఏలూరు రేంజ్ ఐజీ, ఎస్పీ ఆదేశాల మేరకు వచ్చే నెల 4వ తేదీ వరకు బాణసంచా కాల్చడం, విక్రయించడం, నిల్వ ఉంచడం నిషిద్ధమని పెదవేగి సీఐ కె.శ్రీనివాసకుమార్ అన్నారు. మంగళవారం దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ దెందులూరు, పెదవేగి, పెదపాడు మండలాల ప్రజలు వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యేంతవరకు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బాణసంచా విక్రయం, కొనుగో లు చేయరాదన్నారు. పెట్రోలు బంకుల నిర్వాహకులు కంటైనర్లు, బాటిళ్లల్లో పెట్రోలు, డీజిల్ పోయవద్దని, వాహనాల్లో మాత్రమే ఇంధనం నింపాలన్నారు. నిబంధనలు పాటించని బంకు నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని బంకులపై నిఘా ఉంచామని గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలు, రాజకీయపార్టీల నాయకులు పోలీసు సిబ్బందికి సహకరించాలని కోరారు. ఆయన వెంట దెందులూరు ఎస్సై కె.స్వామి ఉన్నారు.

అంగన్‌వాడీలు.. ఆనందాల లోగిళ్లు

- చిన్నారుల ఆలనాపాలనకు చిరునామాగా అంగన్‌వాడీలు
- ఒత్తిడి లేని విద్యకు ప్రభుత్వం ప్రోత్సాహం
- ఉత్సాహంగా ఆటపాటలు.. చక్కని పౌష్టికాహారం



అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఇంగ్లీష్ పదాలను నేర్పిస్తున్న దృశ్యం



పౌష్టికాహారం తీసుకుంటున్న పిల్లలు

బుట్టాయగూడెం: అంగన్‌వాడీ కేంద్రాలు ఆనందాల లోగిళ్లుగా మారాయి. అమ్మ ఒడిలా పిల్లలను ఆదరిస్తున్నాయి. అదేవిధంగా వారి ఆరోగ్యానికి సైతం జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ఆటపాటలకూ వేదికలుగా, పౌష్టికాహారం అందించే ఆత్మీయ హస్తాలుగా మారాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల్లో గతంలో ఉన్న పరిస్థితులను మారుస్తూ చిన్నారుల తల్లిదండ్రులకు భరోసా కల్పిస్తున్నారు. గతంలో ఉన్నటువంటి భిన్నమైన వాతావరణాన్ని పూర్తిగా నిర్మూలించి పిల్లలకు ఉత్సాహంగా ఆట పాటలతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నారు. ఒత్తిడిలేని ఆట పాటల విద్య అందించడంతో పిల్లలను అధిక సంఖ్యలో అంగన్‌వాడీలకు పంపించేందుకు తల్లితండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలన్నింటిలో 3 నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలందరికీ సృజనాత్మకతను జోడించి విద్య నేర్పిస్తున్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో 3ప్లస్, 4 ప్లస్ పాఠ్యపుస్తకాలను ఏర్పాటు చేసి చిన్నచిన్న పదాల ఇంగ్లీష్‌తో పాటు లెక్కలు, తెలుగు, డ్రాయింగ్ వంటివి కూడా నేర్పిస్తున్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పాఠ్యాంశాలకు సంబంధించిన పరికరాలను కూడా ఏర్పాటు చేసి ఆటపాటలతో కూడిన విద్యను నేర్పిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో చదువుకునే పిల్లలు సైతం అంగన్‌వాడీ వైపు వచ్చేలా కృషి చేస్తున్నారు. నాడు – నేడు పథకంలో అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు కూడా మార్చి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నారు.

బుట్టాయగూడెం ప్రాజెక్టు పరిధిలో...

బుట్టాయగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల పరిధిలో 249 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు, 99 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించబడుతున్నాయి. వీటిలో 6 నెలల లోపు వయస్సు గల పిల్లలు 1408 మంది, సంవత్సరంలోపు పిల్లలు 1208, మూడు సంవత్సరాల లోపు వయస్సుగల పిల్లలు 1477 మంది, మూడు నుంచి ఆరేళ్లలోపు వయస్సు గల పిల్లలు 4575 మంది పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకుంటున్నారు.

అంగన్‌వాడీల్లో కల్పిస్తున్న సౌకర్యాలు

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ఎటువంటి ఒత్తిడి లేకుండా ఆటపాటలతో విద్యాబోధన చేస్తున్నారు. అలాగే పిల్లల్లో శారీరక, మానసిక నైపుణ్యాలను పెంపొందించడం కోసం కృషి చేస్తున్నారు. కథలు చెప్పడం ద్వారా పిల్లల్లో ఆలోచనా శక్తి పెంపొందించడం, బొమ్మలు వివిధ ఆకృతులతో అవగాహన కలిగించి వారిలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు కృషి చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు భోజనంతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నారు. ఇళ్లకు సమీపంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు చిన్నారులను నిత్యం తల్లిదండ్రులు పర్యవేక్షించే అవకాశం కల్పిస్తుంది.

ఆటపాటలతో కూడిన విద్య



గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలు పూర్తిగా మార్పు చెందాయి. ప్రభుత్వ ఆదేశాలతో అంగన్‌వాడీ కేంద్రాలు సంతోష లోగిళ్లుగా మారాయి. ఒత్తిడి కలిగించని చదువుతో పాటు ఆటపాటలతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాం. చక్కటి ఆహారాన్ని కూడా పిల్లలకు అందించేందుకు కృషి చేస్తున్నాం

– ఈ.తులసి, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి, బుట్టాయగూడెం

పిల్లల ఆలనాపాలనా బాగుంది



అంగన్‌వాడీ కేంద్రాలు ఆహ్లాదకరంగా మారాయి. పిల్లలు ఇంగ్లీషు, తెలుగు, లెక్కలతో పాటు డ్రాయింగ్ కూడా నేర్పిస్తున్నారు. మా పిల్లలు ఇంగ్లీష్ పదాలను పాడిపాడిగా మాట్లాడుతుంటే చాలా ఆనందంగా ఉంటుంది. మంచి ఆహారం కూడా అందిస్తున్నారు. పిల్లల ఆలనాపాలనను అంగన్‌వాడీలు అమ్మలా చూసుకుంటున్నాయి.

– జి.మమత, బుట్టాయగూడెం

తల్లిదండ్రులకు అవగాహన కలిగిస్తున్నాం



అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కలిగిస్తున్నాం. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమాన్ని గ్రామంలో ప్రచారం చేస్తున్నాం. తల్లిదండ్రులు కూడా పిల్లలను అంగన్‌వాడీలకు పంపించేందుకు ఎంతో ఆసక్తి చూపుతున్నారు.

– ఎన్‌వీ సత్యవతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, కేఆర్‌పురం సెక్టార్

విజయోత్సవ ర్యాలీల్లో బాణసంచా వినియోగించరాదు



వేగవరంలో మాట్లాడుతున్న సీఐ రాజేష్

జంగారెడ్డిగూడెం రూరల్: కౌంటింగ్ అనంతరం గెలుపొందిన అభ్యర్థుల విజయోత్సవాల ర్యాలీలలో బాణాసంచా వినియోగించరాదని జంగారెడ్డిగూడెం సీఐ బి.రాజేష్ చెప్పారు. మండలంలోని వేగవరం, పంగిడిగూడెం గ్రామాల్లో ఆయన ఈమేరకు సదస్సులు నిర్వహించి పలు సూచనలు చేశారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏదైనా సమస్యలు నెలకొంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

టి.నరసాపురం: నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై దుర్గా మహేశ్వరరావు తెలిపారు. మండలంలోని గండిగూడెం గ్రామంలో సిబ్బందితో కలిసి మంగళవారం ఎస్సై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గ్రామానికి చెందిన సాయిల వెంకటరమణ సారా విక్రయిస్తూ పట్టుబడ్డాడు. అతడిని అరెస్టు చేసి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని చింతలపూడి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

కొఠారును కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు



కొఠారు రామచంద్రరావును కలిసిన నేతలు

దెందులూరు: ఏపీ ఆయిల్ ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు మంగళవారం ఆయ న నివాసంలో గాలాయగూడెం సర్పంచ్ చిల కా వెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నేతలు కలిశారు. గాలాయగూడెం గ్రామ శివారు ప్రాంతాల్లో పోలింగ్ సరళిని రామచంద్రరావుకు వివరించారు. నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రణాళిక, సమన్వయంతో పార్టీకి కృషి చేసినందుకు కొఠారు రామచంద్రరావు నాయకులను అభినందించారు. గాలాయగూడెం సొసైటీ చైర్మన్ తోట అచ్చియ్య, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి వెంకటేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, నాయకులు బోయపాటి గణేష్, ముసునూరి శివ, ఇరుకులపాటి సాంబశివరావు, పెద్దిశెట్టి బసవయ్య, గంటా సుబ్బారావు, తోట వెంకన్న, శ్రీధర్, రాజీవ్ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం



ఎం.సూర్యనారాయణ

జంగారెడ్డిగూడెం రూరల్: రెండోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని, ఓటర్ల అంతా వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచారని ఆ పార్టీ ఏలూరు జిల్లా ప్రచార విభాగ కమిటీ ప్రధాన కార్యదర్శి మల్లెల్లి సూర్యనారాయణ అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి పరిపాలన అందించారని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి తోనే సాధ్యమని రాష్ట్ర ప్రజలంతా విశ్వసించారన్నారు. అందుకే మరోమారు వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రజలంతా జగన్‌కు అండగా నిలిచారన్నారు. వచ్చే నెల నాలుగో తేదీన ఫలితాల విడుదలలో వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని, ఆరోజు సంబరాలు చేసుకునేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా సిద్ధమవుతున్నారని తెలిపారు.

ప్రజలంతా వైఎస్సార్ సీపీ వైపే..

- మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి
- పట్టణంలో నిర్వహిస్తున్న కృతజ్ఞతా పర్యటన
- సంబరాలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపు



జంగారెడ్డిగూడెంలో కృతజ్ఞతా పర్యటన నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: జూన్ 4న వచ్చే ఫలితాలతో మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నారని జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని 25, 01, 02 వార్డుల్లో ఆమె మంగళవారం కృతజ్ఞతా పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లోని ప్రజలను కలిసి ఓటు ద్వారా వైఎస్సార్ సీపీపై, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానం చూపిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. గడచిన ఐదేళ్ల కాలంలో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి వారిని ఆర్థికంగా నిలబెట్టారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమ అభివృద్ధే ప్రజలు ఆయన వైపు మొగ్గేలా చేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, క్రిస్టియన్ సామాజిక వర్గాలతో పాటు వెనుకబడిన అగ్రకులాల వారందరూ జగన్‌వైపే నడిచారని బత్తిన లక్ష్మి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఘన విజయాన్ని జూన్ 4వ తేదీన వచ్చే ఫలితాలు నిరూపిస్తాయని, ఈ సందర్భంగా నిర్వహించే సంబరాలకు పార్టీ శ్రేణులు సన్నద్ధంగా ఉండాలన్నారు. జూన్ 9వ తేదీన విశాఖలో రెండోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నారని, ఆ కార్యక్రమాన్ని కూడా శ్రేణులు విజయవంతం చేయాలన్నారు. ఈసారి గతం కంటే మరింత ఎక్కువగా సంక్షేమాన్ని, అభివృద్ధిని సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపిస్తారని బత్తిన లక్ష్మి పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత పరిశీలన



ఏలూరులో స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రతను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూర్యతేజ

బుట్టాయగూడెం: పోలవరం నియోజకవర్గ ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతను ఐటీడీఏ పీఓ, పోలవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ ఆదివారం పరిశీలించారు. ఏలూరు సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంల భద్రత అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవీఎంలకు ప్రభుత్వం మూడంచెల భద్రత కల్పించిందన్నారు. తలుపులకు వేసిన తాళాలను, తాళాలకు ఉన్న సీల్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే అన్ని చోట్ల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కూడా పరిశీలించారు. మూడంచెలు గల కేంద్ర, పోలీస్ బలగాల గార్డ్‌ను, జిల్లా ఆర్డ్‌డ్ పోలీస్ గార్డు, సివిల్ పోలీస్ బందోబస్తులను కూడా పీఓ పరిశీలించడం జరిగింది. ఇక్కడ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అనధికార వ్యక్తులను స్ట్రాంగ్ రూమ్‌లో ఉన్న ప్రాంతాల్లోకి ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని అన్నారు. ఎలక్షన్ కమిషన్ నిబంధనల ప్రకారం అన్ని విధాలుగా జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే ఈవీఎం కంట్రోల్ రూమ్‌ను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గ పరిధిలోని రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలో టర్మ్ డిపాజిట్లపై వడ్డీ రేటు పెంపు



సమావేశంలో టర్మ్ డిపాజిట్లపై వడ్డీ రేటు పెంపును ప్రకటిస్తున్న సంస్థ చైర్మన్ బీవీ కృష్ణారావు

జంగారెడ్డిగూడెం: శ్రీరామచంద్ర సంస్థలు ప్రారంభించి 32 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, సంస్థల్లో భాగమైన శ్రీరామచంద్ర మ్యాక్ సొసైటీ టర్మ్ డిపాజిట్లపై వడ్డీ రేటు పెంచుతున్నట్లు ఆ సంస్థ చైర్మన్ బీవీ కృష్ణారావు ప్రకటించారు. మంగళవారం జంగారెడ్డిగూడెంలో శ్రీరామచంద్ర మ్యాక్ సొసైటీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖాతాదారుల నమ్మకం, వారి సొమ్ముపై భద్రతను కల్పిస్తూ తమ సంస్థ మూడు దశాబ్దాలు పూర్తి చేసుకోగలిగిందన్నారు. ఆర్థిక క్రమశిక్షణే తమ సంస్థల మనుగడకు పునాది అని పేర్కొన్నారు. అలాగే తమ సంస్థలపై నమ్మకం ఉంచి ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలు ఎనలేనివన్నారు. ఈ సందర్భంగా మ్యాక్ సొసైటీలో టర్మ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లు పెంచుతున్నట్లు ఆయన తెలిపారు. గతం కంటే 2 శాతం అధికంగా డిపాజిట్లపై వడ్డీని అందిస్తామన్నారు. 15 రోజుల కాలపరిమితతో టర్మ్ డిపాజిట్‌లు ప్రారంభమవుతాయన్నారు. 3 సంవత్సరాలు పైన టర్మ్ డిపాజిట్లకు 12 శాతం ఇవ్వనున్నట్లు చెప్పారు. 6 సంవత్సరాల 40 రోజులలో సొమ్ము రెట్టింపు అవుతుందన్నారు. అలాగే ఒక సంవత్సరం పైబడిన టర్మ్ డిపాజిట్‌లకు నెలవారీ వడ్డీ తీసుకునే వెసులుబాటు ఉంటుందని, అయితే ఈ డిపాజిట్‌లకు 9 శాతం వడ్డీ చెల్లించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ బ్యాంకర్ చిక్కాల సత్యనారాయణ, మ్యాక్ సొసైటీ మేనేజర్ వీవీఎస్ జగదీష్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ హరిబాబు, ఏవో కె.రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇరుకు వంతెనలపై ప్రయాణికుల ఇక్కట్లు



బ్రిటీష్ కాలంనాటి నారాయణపురం వంతెన

ఉంగుటూరు: ఇరుకు వంతెనలపై ప్రయాణానికి వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కాలం చెల్లిన బ్రిటిష్ కాలం నాటి వంతెనలతో గ్రామాల్లోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గోదావరి ఏలూరు కాలువ నియోజకవర్గంలోని చాలా గ్రామాలను మధ్యగా చీలుస్తూ ప్రవహిస్తుంది. తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు వరకు ఉన్న గ్రామాల్లో ఏలూరు కాలువపై వంతెనలు బ్రిటిష్ కాలంలోనే నిర్మించారు. వాటిని నిర్మించి 7 దశాబ్దాలపైనే అవడంతో వంతెలు శిథిలావస్థకు చేరాయి. ఉంగుటూరు వంతెన గత టీడీపీ పాలన సమయంలో కూలిపోయింది. అక్కడ గ్రామ పంచాయతీ నిర్మించిన బెయిలీ బ్రిడ్జిపై కొంతకాలం రాకపోకలు సాగాయి. ఆ సమయంలో పాత బ్రిడ్జిపైనే రూ.35 లక్షల వ్యయంతో శ్లాబ్ మాత్రమే వేసి చేతులు దులుపేసుకున్నారు. ఆ సమయంలో కొత్త బ్రిడ్జి నిర్మిస్తారని గ్రామ ప్రజలు ఆశించినా నెరవేరలేదు. ఇప్పటికీ ఆ వంతెన మీద రెండు వాహనాలు తప్పుకునే వీలు లేక తరుచూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. జాతీయ రహదారిపై టోలు ఫ్లాజా ఏర్పాటుతో అక్కడ రుసుము ఎగవేత కోసం గ్రామంలోని అంతర్గత రోడ్లపై నుంచి వాహనదారులు వెళుతుండటంతో వంతన వద్ద ట్రాఫిక్ మరింత పెరిగి సమస్య మరింత జఠిలమవుతోంది. భీమవరం –జంగారెడ్డిగూడెం వెళ్లే వాహనాల వల్ల నారాయణపురం వంతెన వద్ద తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో ట్రాఫిక్ సమస్య తీర్చలేక పోలీసులు సైతం తలలు పట్టుకోవాల్సి వస్తోంది. ఇదే పరిస్థితి పూళ్ల గుండుగొలనులోనూ నెలకొంది. ఈ రెండు ప్రాంతాల్లో నూతన బ్రిడ్జిలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

స్వచ్ఛ భారత్ టీమ్ మండల పర్యటన



ఏపుగుంటలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న స్వచ్ఛభారత్ టీమ్ సభ్యులు

టి.నరసాపురం: స్వచ్ఛభారత్ జిల్లా బృందం మండలంలోని ఏపుగుంట, కేతవరం గ్రామాల్లో మంగళవారం పర్యటించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఎంపిక చేసిన ఆయా గ్రామాల్లో బృందం సభ్యులు ప్రతి ఇంటికీ వెళ్లి మరుగుదొడ్లు ఉన్నాయా, ఉన్న మరుగుదొడ్లు వినియోగిస్తున్నారా లేదా, మరుగుదొడ్లలో వినియోగించిన నీరు రోడ్లపైకి వస్తుందా అనే అంశాలను పరిశీలించడంతో పాటు మరుగుదొడ్లు లేనివారికి మరుగుదొడ్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను విధిగా వినియోగించడం ద్వారా పరిసరాల శుభ్రతను పాటించాలన్నారు. స్వచ్ఛభారత్ జిల్లా టీమ్ సభ్యులు ఎంపీడీవో జి.శ్రీను, ఈవోపీఆర్‌డీ ఈఎస్ఎస్ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగరాజు, ఏపీవో జి.వెంకటేశ్వరరావులతో పాటు టి.నరసాపురం ఈవో పీఆర్‌డీ ఎంవీఎస్ రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.


కొబ్బరి కొనుగోలు కేంద్రాలను తెరవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): కొబ్బరి కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరవాలని ఏపీ కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో కొబ్బ రైతుల సమస్యలపై ఆయన మాట్లాడారు. కొబ్బరి కాయలకు కనీస ధరలు రాక రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెయ్యి కొబ్బరి కాయలకు రూ.8 వేలు మాత్రమే ధర వస్తుందన్నారు. వెయ్యి కాయలు కోసి గుట్టగా వేయడానికే రూ.3 వేలు ఖర్చు అవుతుందని తెలిపారు. పంట సాగుకు రైతు పెట్టిన పెట్టుబడి రావడం లేదని అన్నారు. తెగుళ్ల వల్ల దిగుబడులు బాగా తగ్గిపోయాయని తెలిపారు. మన రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు బాగా తగ్గాయని, విదేశీ కొబ్బరి ఉత్పత్తులు ఇబ్బడి ముబ్బడిగా దిగుమతులు కావడంతో దేశీయంగా మార్కెట్లో కొబ్బరి ధరలు పడిపోయాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొబ్బరి అత్యధికంగా సాగు చేసే కోనసీమ, ఉద్దానం, పశ్చిమగోదావరి, ఏలూరు, విజయనగరం, అనకాపల్లి, కాకినాడ తదితర ప్రాంతాల రైతులు నష్టాల పాలై ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రాష్ట్రంలో వెంటనే నాఫెడ్ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో కొబ్బరి కొనుగోలు కేంద్రాలు తెరవాలని, కనీస ధర రైతుకు వెయ్యి కాయలకు రూ.15 వేలు ఇవ్వాలని, రైతుల నుంచి నేరుగా కొబ్బరి కాయలని సేకరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులకు ఏ మాత్రం గిట్టుబాటు కాదని చెప్పారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



అడవికొలనులోని దుకాణాల వద్ద వివరాలు సేకరిస్తున్న ఎస్సై ఆర్ శ్రీను, సిబ్బంది

నిడమర్రు: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ గ్రామాల్లో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు గ్రామ పెద్దలు సహకరించాలని నిడమర్రు ఎస్సై ఆర్.శ్రీను కోరారు. మంగళవారం అడవికొలనులో అన్ని పార్టీల శ్రేణులకు, గ్రామ పెద్దలతో సమావేశం సీఐ సుభాష్ ఆధ్వర్యంలో నిడమర్రు పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకూ కోడ్ అమలులో ఉంటుందన్నారు. అంత వరకూ గ్రామాల్లో పార్టీల జమాపజయాలపై ఎటువంటి ఘర్షణలకు తావులేకుండా ఇరుపార్టీల నాయకులు కృషి చె య్యాలన్నారు. ఎన్నికల కారణంగా గ్రామాల్లోని సంప్రదాయాలకు ఎటువంటి భంగం కలగకుండా అందరూ కలిసి మెలిసి ఉండేలా కృషి చెయ్యాలన్నారు. ఏదైనా చిన్న సమస్యలు వచ్చిన తక్షణం పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఎస్సై కోరారు. అనంతరం గ్రామంలోని దుకాణాల యజమానుల వివరాలు సేకరించి వారిని అప్రమత్తం చేసారు. ఈ కార్యక్రమంలో నిడమర్రు పోలీసులు పాల్గొన్నారు.